

ఉత్తమ రైతులు, విద్యార్థులకు సత్కారం

పార్వతీపురం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి సాగు చేపడుతున్న ఉత్తమ రైతులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సత్కరించారు. గుమ్మలక్ష్మీపురం మండలం బొడ్డగూడకు చెందిన నిమ్మక సీతారాం, పాచిపెంట మండలం అమ్మవలసకు చెందిన రెయ్యి అప్పారావు, మక్కువ మండలం దుగ్గేరు వాసి కొండతామరన లత, సాలూరు మండలం పట్టుచెన్నూరు వాసులు తాడంగి శింగమ్మ, పోలమ్మలను సత్కరించారు. టెన్త్, ఇంటర్‌లో టాపర్స్‌గా నిలిచిన అడ్డాకుల బిందుమతి, నిమ్మక సంతోష్, వాలీబాల్ క్రీడలో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించిన తిమ్మక దీపక్ బృందాన్ని సన్మానించారు.

గిరిజనోత్సాహం

- జిల్లాలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో వేడుకలు
- జిల్లాపై వరాలు కురిపించిన సీఎం
- విజయవాడ నుంచి వర్చువల్‌గా గిరిజనులతో మాట్లాడిన చంద్రబాబు



పార్వతీపురంలో అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పార్వతీపురం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం ఘనంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. పార్వతీపురంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సీతంపేట ఐటీడీఏలో పీవో రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు సంప్రదాయ థింసా నృత్యాలు, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ముందుగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటీడీఏ పీవో మాధవన్‌లు గిరిజన సంఘాల ప్రతినిధులతో కలిసి పార్వతీపురం ఐటీడీఏ వద్ద అడవితల్లి విగ్రహానికి పాలభిషేకం చేశారు. అనంతరం చీరలు, గాజులు, పసుపు కుంకుమ తదితర వాటితో విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు.



విజయవాడలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం ఐటీడీఏలో అడవితల్లి విగ్రహం వద్ద కలెక్టర్, పీవో

నృత్యాలతో అందర్నీ అలరించారు. అనంతరం విజయవాడ నుంచి సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో గిరిజనుల జీవన స్థితిగతులు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పార్వతీపురం, కురుపాం, ఎమ్మెల్యేలు, బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక, ఆర్డీవోలు హేమలత, వీవీ రమణ, ఏఎస్పీ సునీల్‌రోషన్ పాల్గొన్నారు.

సభా వేదిక వద్ద...

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు సంప్రదాయ

జిల్లాపై వరాలు కురిపించిన సీఎం..

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు జిల్లాకు పలు హామీలిచ్చారు. సీతంపేటలో రూ. ఏడు కోట్లతో సమగ్ర పసుపు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, రూ.2 కోట్ల 50 లక్షలతో గిరిజన మ్యూజియంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను వివరించారు.

తలెత్తుకునేలా ఎదగాలి: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు చాలా గొప్పవారని.. అందుకే ఐక్యరాజ్యసమితి కూడా వారి కోసం ఒక ప్రత్యేకమైౖ రోజును ప్రకటించిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రపంచమంతా తలెత్తుకునేలా గిరిజనులు ఎదగాలని, ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిజన నేతలు గంటందొర, మల్లుదొర తదితర విప్లవ పోరాట యోధులు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచుతాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి.. మంచి రంగాల్లోకి వెళ్లేలా చూస్తాం.. రూ.200 కోట్లతో గిరిజన గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. గిరిజన మహిళల కలల సాకారా నికి ఐటీడీఏ సిద్ధంగా ఉంది. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఆదివాసీ దినోత్సవం పండగ మాత్రమే కాదు.. అవగాహన కోసం... ప్రతి ఆడపిల్ల 18 ఏళ్ల వరకు చదువుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. అలా చదివించే పది మంది తల్లిదండ్రులను వచ్చే ఏడాది ఆదివాసీ దినోత్సవం రోజున సత్కరిస్తాం. అని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. ' రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చట్టసభల్లో గిరిజనులకు అత్యున్నత స్థానం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే.. వ్యవసాయం, ఉద్యాన వన పంటల వైపు గిరిజనులను ప్రోత్సహి స్తాం.' అని తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ.. 'గిరిజనుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి మరువలేనిది. నా లాంటి సామాన్య గిరిజన మహిళలను కూడా ఎమ్మెల్యేలుగా చట్టసభలకు పంపించిన ఘనత టీడీపీకే దక్కుతుంది. గిరిజనుల అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యం' అని ఆమె స్పష్టం చేశారు.

ఆటోలు, బైక్‌ల పంపిణీ..

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఉన్నత మహిళా శక్తి కార్యక్రమం ద్వారా రూ.3,32,500 విలువైన ఆటోలను ఐదుగురు గిరిజన మహిళలకు కలెక్టర్ పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువైన ఆవులు, మేకలు, గొర్రెలను 13 మందికి అందించారు. కోళ్ల దాణా, షెడ్ కోసం రూ.30 వేలను అందజేశారు. ఉద్యానవ శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.27,078 విలువైన స్ప్రింక్లర్లను ఇద్దరికి అందించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఇద్దరికి బైక్‌లు, ఐస్ బాక్సులు, మరో ఇద్దరికి డ్రాగ్‌నెట్లను పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న స్టాళ్లు, సాంస్కృతిక ప్రదర్శనలు...

దినోత్సవంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమాచార పౌర సంబంధాల శాఖ, జీసీసీ, వ్యవసాయ ఉద్యాన, మహిళా శిశు సంక్షేమ, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖలు ప్రదర్శనలను ఏర్పాటు చేశాయి. లంకజోడు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు చేసిన సవర నృత్యం, జీఎల్‌పురం ఈఎంఆర్ఎస్ విద్యార్థినులు చేసిన లంబాడి డ్యాన్స్, కురుపాంకు చెందిన విద్యార్థుల కందికోతుల నృత్యం, కురికుట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల జాతాపు నృత్యాలు అందర్నీ విశేషంగా అలరించాయి.

చంద్రబాబుతో మాట్లాడిన గిరిజన మహిళ...



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో వర్చువల్‌గా సీతంపేట మండలం వాబ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సవర తులసి మాట్లాడింది. చిరుధాన్యాలు సాగు చేస్తున్నామని, గిరిజన సంప్రదాయాల ప్రకారం జీవనం సాగిస్తున్నామని ఆమె తెలిపింది. సీతంపేట మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని.. ఆసుపత్రి నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, ట్రైకార్ రుణాలు అందించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. కాగా గత టీడీపీ ప్రభుత్వ కాలంలోనే అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందామని వేడుకకు హాజరైన గిరిజనులు తెలిపారు. రూ.7 కోట్లతో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా ప్రకటించారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. పసుపు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామని, రూ.2.50 కోట్లతో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం ఐటీడీఏ అధికారులు గిరిజన మత్స్య కార్మికులకు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు.

గిరిజనుల పక్షపాతి చంద్రబాబు: మంత్రి

విజయవాడలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. 'గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏలు, విద్యాలయాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు కూడా గిరిజనుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను పెట్టి గిరిజన విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం ద్వారా విదేశాల్లో చదివే అవకాశం కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనుల పాలిట దైవం. డోలీలకు స్వస్తి చెప్పి.. ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుంది. గిరిజన గ్రామాలన్నింటికీ రహదారులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది' అని తెలిపారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సభలో అధికారులు, గిరిజనులు, ప్రజా ప్రతినిధులు

ఆదివాసీ సంబరం

- సీతంపేటలో భారీ ర్యాలీ
- ఆదివాసీ తల్లికి ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సీతంపేట/ రూరల్: సీతంపేట ఐటీడీఏలో పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు గిరిజన నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, గిరిజన సంఘాల ప్రతినిధులు.. ఐటీడీఏ ప్రధానగేటు వద్ద ఉన్న అడవితల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఇండోర్ స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్, వైద్యశాఖ, ఐసీడీఎస్, ఐకేపీ, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే, పీవోలు పరిశీలించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఐటీడీఏ పరిధిలో వివిధ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు థింసా, జాతాపు నృత్యాలతో అందర్నీ అలరించారు. వారితో కలిసి ఎమ్మెల్యే, పీవోలు నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బహుమతుల ప్రదానం..

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ పరిధిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన గిరిజన విద్యార్థులకు ఎమ్మెల్యే, పీవోలు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రూప్ సభ్యులకు కూడా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఏపీవో చినబాబు, డీడీ అన్నదొర, డిప్యూటి డీఈవో నారాయడు, జీసీడీవో రాములమ్మ, ఏఎంవో కోటేశ్వరరావు, సర్పంచ్ కళావతి, టీడీపీ నాయకులు భూదేవి, తేజోవతి, హెచ్ ప్రసాద్, గిరిజన సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే..

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. ఆదివాసీ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 'గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, కాలువలు, వైద్య సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.. డోలీ మోతల నివారణపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. గిరిజన గర్భిణల కోసం వసతి గృహాలను ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో మలేరియా వ్యాధులు సంభవించ కుండా, విద్యార్థుల మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి. స్థానిక ఆసుపత్రి నుంచి రోగులను రిఫరల్ చేసే పరిస్థితి ఉండకూడదు. దీనిపై ఐటీడీఆర్‌పీవో ప్రత్యేక దృష్టిసారించాలి' అని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు 50 సంవత్సరాలకే పింఛను సౌకర్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, దీని అమలుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సీతంపేటలో గిరిజన భవన్ ఏర్పాటు చేస్తామని, దానికి అవసరమైన సలాన్ని పరిశీలించాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా జీవో నెంబర్-3 అమలు చేస్తామన్నారు.



విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే, పీవో

ప్రత్యేక కార్యాచరణ..

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు పీవో రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం విద్య, వైద్యం రహదారులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని, వాటి అభివృద్ధికి తాను కృషి చేస్తానని స్పష్టం చేశారు. అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, గతంలో మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయిస్తామని వెల్లడించారు. కొండశిఖర ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్స్‌లు చేరేలా చూస్తామన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా 1733 ఇళ్లు మంజూరు జరిగినట్టు పీవో తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అంది స్తామన్నారు. గిరిజన మ్యూజియం పనులు పూర్తిస్థాయిలో చేపడతామని చెప్పారు.మిల్లెట్ హబ్‌గా సీతంపేటను తీర్చిదిద్దుతామని పీవో తెలిపారు. దీనిలో భాగంగా అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిడ్డిక తేజేశ్వరరావు, పురుషోత్తం, ఉమామహేశ్వరరావు, బిడ్డిక శ్రీనివాసరావు, హిమరిక పవన్, తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల థింసా నృత్యం

ప్రసవ వేదన

- రోడ్డు సౌకర్యం లేక ఆసుపత్రికి చేరేందుకు అవస్థలు
- ఆదివాసీ దినోత్సవం రోజేనే గిరిజన గర్భిణికి ఇక్కట్లు
- ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మక్కువ: డోలీ మోతలు.. ప్రసవ వేదనలు గిరిజనులకు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. వారి కష్టాలు మాత్రం తీరడం లేదు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వేళల్లో వారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తాజాగా ఓ గిరిజన గర్భిణీ ఆదివాసీ దినోత్సవం రోజేనే ప్రసవానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఆఖరకు ఫీడర్ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారు. వివరాల్లో వెళ్తే.. శంబర పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం బిరమాసికి చెందిన చోడిపల్లి లిల్లీకి శుక్రవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో భర్త ఉత్తర అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అయితే అది రావడం ఆలస్యం కావడంతో డోలీ కట్టుకుని.. బీరమాసి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద గ్రామానికి తీసుకొచ్చారు. అక్కడకు చేరిన తర్వాత ఓ బైక్ సాయంతో ఎస్.పెద్దవలస గ్రామం వరకు వెళ్లగా.. ఎదురుగా ఫీడర్ అంబులెన్స్ వచ్చింది. దీంతో గర్భిణీని అందులో ఎక్కించి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శంబర పీహెచ్‌సీకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే మార్గమధ్యంలోనే ఆ మహిళ ఫీడర్ అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. గర్భిణీకి పూర్తిగా నెలలు నిండలేదని వైద్యాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు ఆయన చెప్పారు.



ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవించిన లిల్లీ

ఐటీడీఏ పీవోల బదిలీ

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

పార్వతీపురం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం , సీతంపేట ఐటీడీఏ పీవోలను బదిలీ చేస్తూ.. శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పార్వతీపురం ఐటీడీఏ పీవో సేదు మాధవన్‌ను విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న జేసీ కార్తిక్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు. సీతంపేట ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డిని పశ్చిమ గోదావరి జిల్లా జేసీగా నియమించారు. అయితే పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలను ఇంకా నియమించలేదు. కాగా వారిద్దరూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే బదిలీ కావడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

సొంత మండలాలకు ఎంపీడీవోలు

గరుగుబిల్లి, ఆగస్టు 9: సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీలపై ఇతర జిల్లాలకు వెళ్లిన 'మన్యం' ఎంపీడీవోలు తిరిగి సొంత మండలాలకు వెళ్లనున్నారు. గతంలో విధులు నిర్వహించిన మండలానికే మరికొద్ది రోజుల్లో రానున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల అసోషియన్ విన్నపాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు గురువారం పీఆర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై జడ్పీ సీఈవోలు, కలెక్టర్లకు సమాచారం అందించారు. జడ్పీ పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టి నివేదికలు అందించాలని డైరెక్టర్ ఆదేశించారు. కాగా జిల్లాలో 15 మండలాలకు చెందిన ఎంపీడీవోలు మరికొద్ది రోజుల్లో విధుల్లోకి చేరనున్నారు. అయితే జిల్లా శాసనసభ్యులు పాత వారిపై మొగ్గు చూపుతారో, లేదంటే మార్చుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇకపోతే ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవోలు తక్షణమే రిలీవ్ అయ్యేందుకు ఎదురు చూస్తున్నారు.

శ్రావణ సందడి





సాలూరు/పాలకొండ: కామాక్షి కోట దుర్గమ్మ ఆలయాల్లో సామూహికంగా కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ఏఐసీటీఈ

ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్ ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్‌ఓ/ఎస్ఎన్‌ఓ/ఎంఎన్‌ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి
DIKSUCHI

జేఎన్‌టీయూ హెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్స్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ భోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా 'రైడ్'కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే. మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.

సూర్యకు స్వల్ప గాయం



తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్ళీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

నిరీక్షణకు తెర

కొత్తగా...



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.


నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధే కృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.



భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రహరీ, (ఇన్‌సెట్‌లో) గోడపై విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ముద్రించిన దృశ్యం

స్థలం మాది.. పేరు విశాఖదా?

● ఎయిర్‌పోర్టు ప్రహరీపై ముద్రించిన పేరుపై భోగాపురం వాసుల మనోవేదన ● మార్చాలని డిమాండ్

భోగాపురం, ఆగస్టు 9: అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును భోగాపురంలో నిర్మిస్తుంటే విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని గోడపై ఎలా ముద్రిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసిత గ్రామాల్లో ఈ విషయం తరచూ చర్చనీయాంశమవుతోంది. నేతల దృష్టికి కూడా వెళ్లింది.

భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కోసం స్థానిక రైతులు సుమారు 2700 ఎకరాలు ఇచ్చారు. నాలుగు గ్రామాలు ఎయిర్‌పోర్టులో కనుమరుగయ్యాయి. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి భవిష్యత్ తరాల కోసం వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కాగా ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభం కాకముందు నుంచి అన్ని సందర్భాల్లోనూ భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు అనే పిలుస్తూ వస్తున్నారు. అధికారులు, నాయకులు కూడా అలాగే చెబుతున్నారు. మరి ప్రహరీపై మాత్రం పేరు మార్చారు. విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని పలుచోట్ల ముద్రించారు. దీనినే స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఇలా ఎలా పేరు పెడతారని ప్రశ్నిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు 50శాతంపైగా పూర్తి కావొచ్చాయి. ప్రహరీపై ఎక్కడ చూసినా విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని ఉంది. ఇది స్థానికుల మనోభావాలను దెబ్బతీస్తోంది. మండలంలోని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు.

ఎయిర్‌పోర్టు కోసం భూములు కోల్పోవడమే కాకుండా పూర్వ నుంచి జీవిస్తున్న స్థలాలను కూడా వదులుకొన్నామని, కనీసం భోగాపురం ఎయిర్‌పోర్టు అని ఎక్కడా లేకపోవడం దారుణమని స్థానికులు అనుకొంటున్నారు. ఎయిర్‌పోర్టు పేరు పక్కన భోగాపురం పేరు ఉండేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై జీఎంఆర్ సంస్థ వారిని వివరణ కోరగా ఇది ఎయిర్‌పోర్టు పేరు కాదని ఎయిర్‌పోర్టును నిర్మిస్తున్న జీఎంఆర్‌కి సంబంధించిన పేరు అని కొట్టిపారేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

రామభద్రపురం: మండలంలోని చెదరడవలసకు చెందిన ఓ బాలిక శుక్రవారం చికిత్సపొందుతూ మృతిచెందింది.ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ కథనం మేరకు... చెదరడవలసకు చెందిన నీలాద్రి గౌరమ్మకు (16)తండ్రి మందలించడంతో ఈనెల ఏడోతేదీ ఉదయం గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో 108లో బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది.ఆమె తండ్రి నీలాద్రిపొట్టన్నదొర ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు. గౌరమ్మ తొమ్మిదో తరగతితో చదువు మానేసింది.

ఏవోబీలో గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: ఏవోబీలో కొఠియాగ్రూపు గ్రామం మూలతాడివలస సమీపంలో ప్రవహిస్తున్న గంజాయిభద్రగెడ్డ (చిట్టిగెడ్డ)లో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం కనిపించింది.ఈ విషయమై సమాచారం అందుకున్న సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ హుటాహుటిన అక్కడకు వెళ్లారు. మృతుడు 35 ఏళ్ల వయస్సు వ్యక్తిగా గుర్తించామని చెప్పారు. మరణించి సుమారు 15 రోజులు కావడంతో మృతదేహం ఛిద్రమై ఉందన్నారు. ముఖం గుర్తుపట్టలేని విధంగా తయారయ్యిందన్నారు. కేవలం పుర్రెమాత్రం ఉందని చెప్పారు. మృతదేహానికి అక్కడికక్కడే శవపరీక్షలు నిర్వహించారు.సాలూరుసర్కిల్ పరిధిలో ఇటీవల మిస్సింగ్ కేసులు నమోదు కాలేదని, మృతుడి ఆచూకీకోసం ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

భోగాపురం: గంజాయి కేసులో నలుగురిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. భోగాపురం గ్రామానికి చెందిన ఓదూరు సాయివరప్రసాదు, అడ్డగర్ల దేవేంద్రకుమార్, మరాడ వెంకటేష్, కొల్లి సాయి నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తుండడంతో అరెస్టుచేసి, కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.పూర్తిగా విచారించి వారిని కోర్టుకు తరలిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి ఉన్నా, సేవిస్తున్నా ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బసవపాలెం సమీపంలో పేకాటరాయుళ్లు..

భోగాపురం: మండలంలోని బసవపాలెం సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామని సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. బసవపాలెం సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో టాస్‌ఫోర్సు బృందం ఘటనా స్థలానికి చేరుకుని, దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.లక్షా 26వేల 500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులకు అప్పగించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

● సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం రూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలుఅందాలని, ఇందుకోసం వివిధస్థాయిల్లో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం రాజాం మండలపరిషత్ కార్యాలయంలో న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వితంతువులు ప్రభుత్వపథకాలు పొందడంలో అవసరమైన సహాయం కోసం మండల న్యాయసేవాసంఘం పనిచేస్తోందని, సంఘసేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయి తేజ యువత మత్తుపదార్థాలకు దూరంగాఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

విజయనగరం టౌన్: విజయనగరంలోని సర్‌విజ్జీ మైదానం, పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. సర్‌విజ్జీ మైదానంలో తూర్పుగోదావరి-విజయనగరం జిల్లా జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో తూర్పుగోదావరి జట్టు 70.2 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులో ఏవీవీ విజయ్, పి.పాండురంగా అర్ధసెంచరీలు సాధించారు. విజయనగరం జట్టులో బౌలర్లు సమిష్టిగా రాణించి తూర్పుగోదావరిజట్టు బ్యాట్స్‌మెన్లను కట్టడి చేశారు. పి.తేజస్వీ 18 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోయి 58 పరుగులు చేసింది. కెప్టెన్ పి.తపస్వీ 30 పరుగులు, ఎస్.హరీష్ 18 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. కాగా పీవీజీరాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు సమిష్టిగా రాణించి 69.2 ఓవర్లలో 330 పరుగులు సాధించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 14 ఓవర్లలో వికెట్ నష్టపోయి 34 పరుగులు చేసింది.

ఎరువుల కోసం రైతుల నిరసన

వేపాడ: కొండగంగుబూడి రైతులు ఏపీ రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ఎరువులకోసం ఆర్బీకే వద్ద శుక్రవారం నిరసనతెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆర్బీకేకు ఎరువులు వచ్చి మూడురోజులు గడుస్తున్నా అందజేయకుండా సిబ్బంది తప్పించుకుని తిరుగుతున్నారని ఆరోపించారు.

క్విట్ కార్పొరేట్ నిరసన ర్యాలీ

బొబ్బిలి: బొబ్బిలిలో కళాసీ సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు శుక్రవారం క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కూడలిలో వర్మ మాట్లాడుతూ వ్యవసాయరంగం, రిటైల్ వ్యాపార రంగంలోకి బడాకార్పొరేట్ కంపెనీలు చొరబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పీడిక అసిరియ్య, రైతుకూలీ సంఘం నాయకులు ప్రసాద్, సూరిబాబు, రాజు, బోగాది అప్పలస్వామి, అప్పారావు, రామకృష్ణ, కళాసీలు, గిరిజనులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం ఆందోళనకు దిగింది. కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని కోరుతూ క్విట్ కార్పొరేట్ అంటూ నినాదాలు చేశారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల జగన్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పునరుద్ధరించాలి: కలెక్టర్

కలెక్టరేట్: ద్వారపూడి గ్రామం పరిధిలోగల జేఎన్‌టీయూ వద్ద కొండపై ఉన్న సోలార్ ప్లాంట్‌ను 15 రోజుల్లో పునరుద్ధరించాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సోలార్ ప్లాంట్ పరిస్థితిపై కలెక్టరు ఆరా తీశారు. నెడ్‌కాప్ ఆధ్వర్యంలో రూ.4.8 కోట్లతో 2017లో ప్లాంట్ ఏర్పాటు చేశారని, పదేళ్ల వరకూ కాంట్రాక్టరు నిర్వహణ చూడాల్సి ఉందని మునిసిపల్‌కమిషనర్ మల్లయ్యనాయుడు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ప్యానెల్స్ అన్ని పాడవడంతో వాటిని పునరుద్ధరించడానికి కనీసం రూ.రెండు కోట్ల ఖర్చవుతుందని నెడ్‌కాప్ అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. ప్లాంట్‌ను నిర్లక్ష్యం గా వదిలివేయడంతోనే నష్టంజరిగిందని కాంట్రాక్టర్, నెడ్‌కాప్ అధికారులకు నోటీసు లు జారీచేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఈఈ శ్రీనివాసరావు, నెడ్ కాప్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కర్మాగారాల్లో తనిఖీ నివేదిక

జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో స్థానిక ఉద్యోగాల నిబంధనలు మేరకు 75 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. గత వారం జరిగిన సమావేశంలో అన్ని కంపెనీల్లో తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. ఆయన ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, పరిశ్రమల, కార్మికశాఖ అధికారులు కర్మాగారాల్లో తనిఖీనిర్వహించి శతశాతం స్థానికత ఉన్నట్లు శుక్రవారం కలెక్టరు చాంబర్‌లో జరిగిన సమావేశంలోని నివేది కలను అందించారు. ప్రతినెల 25లోగా ఈ మూడు శాఖలు నివేదికలు అందించాలని కలెక్టరు సూచించారు.

ప్రతి గ్రామానికి నీరందేలా చర్యలు: ఎమ్మెల్యే

తెర్లాం: ప్రతి గ్రామానికి నీరందేలా చర్యలు తీసుకున్నట్లు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు.శుక్రవారం విజ యరాంపురంలో విలేకరులతో మాట్లాడు తూ గతపాలకుల నిర్లక్ష్యం వల్లే తోటపల్లి కాలువ మరమ్మతులకు నోచుకోలేదని, దీంతో కొన్ని వందల ఎకరాలకు నీరందక పంటలు పోయాయని తెలిపారు. రైతు లకు అండగా ఉంటానని హామీఇచ్చారు. మండలానికి రూ.ఐదు కోట్లు ఉపాధి నిధులను మంజూరుకావడంతో గ్రామా ల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. తన సొంత నిధులు సుమారు రూ.కోటికిపైగా వెచ్చించి తోటపల్లి కాలువ లను మరమ్మతులుచేశామని చెప్పారు. అవసరమైతే ఇంకా నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంక టనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల నాయ కులు శంకరరావు, సురేష్ పాల్గొన్నారు.

వరి ఉబాలు పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురంలో రైతు స్వామినాయుడు పొలంలో ఉబాలు వేస్తున్న వరి పంట పొలాన్ని శుక్రవారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో ఏ రకం వరి వేశారో గ్రామ వ్యవశాయ సహాయకురాలు శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. పొలంలో వరుస క్రమంలో నాట్లు వేయడం పరిశీలించి మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

18 మంది హైరిస్క్ గర్భిణులు

కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో 18 మంది గర్భిణులను హైరిస్క్ కలిగిన వారిగా గుర్తించినట్టు వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్తవలసకు చెందిన సత్యసాయి సమితి సభ్యులు గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జగదాంబ, పద్మావతి, హెల్త్‌అసిస్టెంట్ సత్యారావు, సాయిరాం ట్రస్టు సభ్యులు పి.రవికుమార్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఎమ్మెల్యేకి వినతులు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు నామినేటెడ్ పదవుల కోసం వినతిప త్రాలు అందజేస్తున్నారు.తమ సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఏఎంసీ పాలకవర్గం, పైడిమాంబ, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయాలతోపాటు, మరో పది వరకూ వివిధ ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు నియమించాల్సిఉంది. ఏఎంసీ చైర్మన్ పదవి కోసం గాజులరేగకు చెందిన నడిపిల్లి రవికుమార్, కర్రోతునర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, జొన్నవలసకు చెందిన మార్తి నారాయణప్పుడు తదితరులు తమ పేర్లను పరిశీలించాలని విన్నవించారు. డైరెక్టర్ల పదవుల కోసం కూడా పలువురు వినతులు సమర్పించారు. పైడిమాంబ దేవ స్థానానికి సంబంధించి ట్రస్టు బోర్డు సభ్యుల కోసం కూడా ఎమ్మెల్యే అదితి గజపతి రాజుకు దాసన్నపేటకి చెందిన కాగిత శ్రీనివాస్‌యాదవ్, ఇప్పిలి అప్పలకొండ, హు కుంపేట ప్రాంతం నుంచి కామేష్, రైల్వే స్టేషన్ ఏరియా, మూడు లాంతర్లు ప్రాంతం నుంచి కూడా పలువురు తమ, తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు.

చెరకు దిగుబడికి పంచసూత్రాలు కీలకం

రేగిడి: చెరకు సాగులో అత్యధిక దిగుబడి సాధనకు రైతులు పంచసూత్రాలు పాటించాలని రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ హెడ్ షణ్ముఖసుందరం, ఆర్‌అండ్ మేనేజర్ రామచంద్రన్, ఇఐడీప్యారీ డీజీఎం కేన్ రమేష్ తెలిఏరు. శుక్రవారం సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో ఉంగరాడమెట్ట చెరకు ప్రాంతీయ కార్యాలయంలో చెరకుసాగు, అధిక దిగుబడులపై రైతులతో సమావేశం నిర్వహించారు. సకాలంలో ఎరువుల యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, దూరపుచాళ్లపద్ధతి, విత్తన ఎంపిక, సుక్ష్మపోషకాలు వినియోగం ద్వారా అధికదిగుబడులు సాధ్యమని రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేన్‌మేనేజర్లు కమల్‌పట్నాయక్, మురళి, డివిజన్ ఇన్‌చార్జి అశోక్, క్షేత్రస్థాయి సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు.

షుగర్ కేన్ గ్రోయర్స్ సొసైటీ పాలకవర్గ ఎన్నిక

బొబ్బిలి: ది బొబ్బిలి షుగర్ కేన్ గ్రోయర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా సబ్బాన శ్రీనివాసరావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా బేతన పల్లి సత్యం, కార్యదర్శిగా యాళ్ల శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి. సత్య నారాయణ తెలిపారు. పాలకవర్గ సభ్యులుగా బలగ శ్రీనివాసరావు, బేతన పల్లి నగి రేశు, బొన్నాడ శ్రీరాములు, వంగపండు శ్రీరాములు నాయుడు, వజ్జి లక్ష్మణరావు,సాలా హరిగోపాలరావు ఎన్నికయ్యారు. వీరికీ ధ్రువీకరణపత్రాలను అందజేసిన అనం తరం ఎన్నికల అధికారి సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయండి

వేపాడ: ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని పలువురు వక్తలు డిమాండ్‌చేశారు. వేపాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గిరిజన నేతలు ఆదివాసీ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండల ఆదివాసీ సంఘ అధ్యక్షుడు వంతు గౌరునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దళిత నాయకుడు కుంచి కోటేశ్వరరావు, కొప్పల అప్పారావు,మాలమహానాడు, గిరిజన నాయకులు దేబారిక కిరణ్, బంగారయ్య, కొప్పల నరసింహమూర్తి, సన్యాసిరావు, దేబారిక రవి, దేబారిక అప్పారావు, ఉగ్గిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

రాజాం: చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శలకు నిర్వహించిన రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈసందర్భంగా సోపేరు, కొఠారిపురంల్లో చెత్తసంపద కేంద్రాలు సర్పంచ్ లు, కార్యదర్శులకు పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేగిడి: పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాల నిర్వహణ వల్ల సేంద్రియ ఎరువు తయారీతోపాటు, పారిశుధ్య నిర్వహణ మెరుగువుతుందని ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్‌కార్యాలయంలో రెండోరోజు సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణలో భాగంగా అమదాలవలస ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. సత్యనారాయణతోపాటు రిసోర్స్‌పర్సన్లు గోపి, హేమసుందరావు, రాజేంద్ర పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నిర్వహణ, శానిటేషన్ సర్పంచ్, ఎంపీటీసీల బాధ్యతను వివరించారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

బొబ్బిలి రూరల్: వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులోఉండాలని తహసీల్దార్ ఎం.శీను తెలిపారు. శుక్రవ్వరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలు ప్రజలకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను విరమించకపోతే ఉద్యమం

శృంగవరపుకోట రూరల్: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తలపెట్టిన ఎస్సీ వర్గీకరణయోచనను విరమించాలని...లేనిపక్షంలోదేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారంచుడతామని జిల్లా జైభీమ్ షెడ్యూల్ కాస్ట్ అండ్ ట్రైబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసవ సూర్యనారాయణ డిమాండ్‌చేశారు. ధర్మవరం అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసయ్య, సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి సొంగ కృష్ణారావు, రిటైర్డ్‌తహసీల్దార్ వజ్రపు సన్యాసప్పడు, ఐనాడ దేముడు, డోల కేశవ, లోతేటి కనకమ్మ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ తప్పనిసరిగా ఉండాలి

రాజాం: ప్రతి మండలంలో తప్పని సరిగ్గా ఓపెన్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఈవో కె వెంకటరమణ సూచించారు. శుక్రవారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ టి.సన్యాసి రాజు, ఎంఈవోలు జిల్లా హెచ్‌ఎం సంఘం డీసీపీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు,

దూరవిద్య కేంద్రం ప్రారంభం

వంగర: వంగర జడ్పీపాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక దూరవిద్య కేంద్రం పారం భించారు. అనంతరం గోడపత్రికను చీపురుపల్లి డిప్యూటీడీఈవో రమణయ్య ఆవి ష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రమణ, ఎంఈవో దుర్గారావు, హెచ్‌ఎం రమణమ్మ పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

కొత్తవలస: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

విజయనగరంక్రైం: టూటౌన్‌స్టేషన్ పరిధిలో అసాం ఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్‌సీఐ టి.శ్రీనివాసరావు హెచ్చరిం చారు. శుక్రవారం టూటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ రాత్రిపూట గస్తీ ముమ్మరం చేస్తా మని, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నివారణకు తనిఖీ నిర్వహిస్తామన్నారు. రాత్రి పూట యువత అనవసరంగా తిరగొద్దని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసన

విజయనగరందాసన్నపేట: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధి బొంగా భానుమూర్తి కోరారు. ఈమేరకు శుక్ర వారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచా రణకు ఆదేశాలుజారీ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో రాజ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.



గరుగుబిల్లి: తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ భవన ప్రాంగణంలో ఆదితల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పారినాయుడు



కొమరాడ: పెదఖేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో డప్పు వాయిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీరాములు



కురుపాం రూరల్: ఐటీడీఏలో జరిగిన గిరిజనోత్సవంలో లంకాజోడు పాఠశాల బాలికలు



పార్వతీపురంటౌన్: అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

గిరిజన సంప్రదాయం ప్రతిబింబించేలా..

- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు.. వివిధ శాఖల స్టాల్స్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. వివిధ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీలు తమ సంస్కృతిని, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైటీసీలో శుక్రవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ఆదివాసీల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుధ, రుబ్బ లోవరాజు, వెంపటాపు భారతి, తదితరులు పాల్గొన్నారు. టిక్కబాయి, గుమ్మలక్ష్మీపురం, భద్రగిరి, పీటీజీ బాలికల పాఠశాలలో కూడా ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించారు.

గిరిజన వర్సిటీ తరలింపు సరికాదు

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో నిర్మించతలపెట్టిన గిరిజన వర్సిటీని ఎస్.కోట నియోజక వర్గంలో ఉన్న రెల్లికి తరలించడం సరికాదని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. తోణాంలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జీవో నెం.3 పునరుద్ధరణకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి కృషి చేయాలని ఆయన కోరారు.



పార్వతీపురంటౌన్: కురుకుట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన



గుమ్మలక్ష్మీపురం: బాలికలతో థింసా నృత్యం చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



కురుపాం: గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో..



సాలూరు రూరల్: తోణాంలో సాంస్కృతిక కార్యక్రమాలు



సీతంపేట: గొయిదిలో థింసా నృత్యం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి



పార్వతీపురంటౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ స్టాల్

ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కొమరాడ: ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం తమవంతు సహకారం అందిస్తుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇందిరానగరం గ్రామాన్ని, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవం తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని డ్వాక్రా గ్రూపుల సంఘాలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేస్తుందని, వాటి ద్వారా వ్యాపారాలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీవో మాధవన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తోటపల్లి సమీపంలో ఏనుగుల సంచారం



పార్వతీపురం-కురుపాం ప్రధాన రహదారిలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న ఎడమ కాలువలో ఏనుగులు కొంత సమయం సేదతీరిన తర్వాత కాలువ గట్టుపై తిష్ఠ వేశాయి. దీంతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు, మూడు రోజుల కిందట తోటపల్లి పంచాయతీ పరిధిలోని నందివానివలస గ్రామ సమీపంలో ఏనుగులు సంచరించాయి. అనంతరం జియ్యమ్మవలస మండలం కుదమ గ్రామ పరిసరాలకు తరలివెళ్లిన ఏనుగులు శుక్రవారం తోటపల్లి గ్రామ సమీపంలోకి ప్రవేశించాయి.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు



క్రసర్‌ను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

కొమరాడ: మండలంలోని రామభద్రపురం గ్రామ సమీపంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమ రవాణను ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. నది నుంచి ఇసుక తరలింపునకుగాను వాహనాల రాకపోకల కోసం క్రసర్‌డస్ట్‌తో రహదారి వేసేందుకు కొందరు ట్రాక్టర్‌తో క్రసర్ డస్ట్‌ను తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వై.సింహాచలం, కె.అచ్యుతరావు, తదితరులు ఇసుక రేవు వద్దకు చేరుకుని ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి, తహసీల్దార్ రమేష్‌కు అప్పగించారు. సంబంధిత వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తామని తహసీల్దార్ చెప్పారు. అంతేకాకుండా వాహనాలు రాకపోకలు జరగకుండా ట్రెంచ్‌ను కట్ చేస్తామని తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని అన్నారు.

శ్రీరామ షుగర్ కేన్ సొసైటీ ఎన్నిక

సీతానగరం: స్థానిక శ్రీరామ షుగర్ కేన్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం బొబ్బిలిలో నిర్వహించారు. ఛైర్మన్‌గా సబ్బాన శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా బేతనపల్లి సత్యం, డైరెక్టర్లుగా సాల హరిగోపాల్, బి.శ్రీరాములు, బి.శ్రీనివాస రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పి.సత్యనారాయణ తెలిపారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత

పాలకొండ: శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని రైతు ఖండాపు ప్రసాదరావు గత బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిని అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గత రెండు రోజులుగా తోటపల్లి ఎడమ కాలువలో సొంత నిధులతో జేసీబీ ద్వారా 8వ బ్రాంచి కాలువ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. నరసింహచెరువులో పూడిక తీస్తే దీని ద్వారా ఐదు మదుముల ద్వారా గొలుసుకట్టు చెరువులకు నీరు చేరుతుందని ప్రసాదరావు వెల్లడించారు. ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



తోటపల్లి ఎడమ కాలువకు జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానానికి 'మేము సైతం'

- కలెక్టరేట్‌లో నిర్వహణ

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం 'మేము సైతం' పేరిట రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటీడీఏ పీవో మాధవన్‌తో పాటు జిల్లా పీఆర్, ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ నేతృత్వంలో 65 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 50 రోజుల వ్యవధిలో మొదటి దశ పూర్తవుతుందని, వారం రోజుల నుంచి పది రోజుల వ్యవధిలో మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో రక్త నిల్వల కొరత తీర్చేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'మేముసైతం' కార్యక్రమంలో రక్తదాతగా నమోదు చేసుకోవడానికి వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేస్తామని జేసీ శోభిక తెలిపారు. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీవో బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

సాలూరు రూరల్ సీఐగా రామకృష్ణ

సాలూరు రూరల్: సాలూరు రూరల్ సీఐగా పి.రామకృష్ణ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బాలకృష్ణ వీఆర్‌కు పంపిస్తూ డీఐజీ ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో విజయవాడ ఏసీబీలో పనిచేస్తున్న పి.రామకృష్ణకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన సాలూరు రూరల్, అర్బన్ ఎస్ఐలుగా పనిచేశారు. ఇక్కడ నుంచి పీఎం పాలెం బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి పదోన్నతిపై ఏసీబీకి వెళ్లారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

భామిని: పంచాయతీల అభివృద్ధిపై శిక్షణలో భాగంగా మండలంలోని కీసర గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణారావు పాల్గొని, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కుమారుడు వలరౌతు కృష్ణారావు, అప్పట్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మహేంద్ర కృషితో చెత్త నుంచి సంపద యూనిట్‌ను ప్రారంభించారు. ఈ చెత్త సంపద కేంద్రం వల్ల గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని ఈవోఆర్డీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రంపై అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్డీ

ప్రతిఒక్కరికీ ఆధార్ తప్పనిసరి

భామిని: ప్రతిఒక్కరికీ ఆధార్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో ఆర్.కిషోర్ కుమార్ అన్నారు. ఇటీవల ఆధార్ అవస్థలు పేరిట ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆధార్ ఇన్‌వాల్యూడ్‌గా ఉన్న వ్యక్తులను ఆరా తీసి బత్తిలి డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించారు. ఆధార్‌ను యాక్టివ్ చేసేందుకు అవసరాలపై ఆధార్ జిల్లా బృందంతో సంప్రదించి శిర్ల వంశీ, కోలక మల్లేష్ ఆధార్‌లను ఇప్పటికే ఎనరోల్‌మెంట్ అయి ఉండడంతో వీరు దరఖాస్తు చేసిన ధ్రువ పత్రాలను ఆన్‌లైన్‌లో ఆధార్ సెంటర్‌కు పంపారు. 15 రోజుల తర్వాత ఆధార్ అప్‌డేట్ కాకపోతే మళ్లీ సెంటర్‌కు రావాలని డిజిటల్ అసిస్టెంట్ సూచించారు.

జూనియర్ కళాశాలలో ఆటల సందడి

పాలకొండ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, పరుగు పందాల్లో ప్రతిభ చూపించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ హరగోపాల్, వ్యాయామ అధ్యాపకుడు సాసుబిల్లి నాగభూషణరావు పాల్గొన్నారు.

గర్భిణులకు అంకితభావంతో సేవలందించాలి

గరుగుబిల్లి: గర్భిణులకు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సంతోష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నమ్మి, రమణమ్మ, హెల్త్ విజిటర్ సీహెచ్ ఉదయకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీనివాసరావు, అల్లు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. ● **భామిని:** మండలంలోని బాలేరు పీహెచ్‌సీ పరిధిలో ప్రధానమంత్రి సురక్షా మాతా యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 36మంది గర్భిణులకు వైద్యాధికారి శివకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు పలు సూచనలు, సలహాలు అందించారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన

సీతానగరం: బలిజిపేట మండలం అరసాడ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీ భారతి రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్సిడీపై రైతులకు సరఫరా చేసిన వరి వంగడాల విశిష్టత, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, కాలిబాటలు తీయడం, కేలీలు తొలగించ డంపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రావణ్, సిబ్బంది ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సమావేశం

వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్ఆర్‌పీ దాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వివరాలు సేకరించాలన్నారు. 10,138 పింఛన్లపై కూడా ఆడిట్ నిర్వహిస్తామన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల అభివృద్ధిపై రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ యూనిట్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఒడిశా

కమలం గూటికి కొండబాబు

రాయగడ: బిజూ జనతాదళ్‌లో సుదీర్ఘ కాలం నుంచి రాజకీయ జీవితం గడిపిన బిజద సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు బీజేపీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఇటీవల రాయగడ వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌తో ఆయన మంతనాలు జరిపి, కమలం పార్టీలో చేరేందుకు తన మనోగతాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈనెల 16న భువనేశ్వర్‌లోని బీజేపీ కార్యాలయంలో మన్మోహన్ సామల్ సమక్షంలో తన అనుచర గణంతో పార్టీలోకి చేరేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈసందర్భంగా కొండబాబు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దశాబ్దాలుగా పార్టీకి సేవ చేసినప్పటికీ తగిన గుర్తింపు లేని కారణంగా, పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

దత్తత స్వీకారం

రాయగడ: పిల్లలు లేని ఓ దంపతులు ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రం నుంచి ఓ శిశువును కలెక్టర్ మనోజ్ సత్యవాన్ చేతులమీదుగా దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వారికి శిశువును అప్పగించారు. శిశువు కోసం వారు నాలుగేళ్ల కింద దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తును పరిశీలించిన అధికారులు అన్ని నిబంధనల ప్రకారం వారికి శిశువును అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ కేంద్రం అధికారులు కైలాష్ చంద్రపాల్, గగరిన్ నబర్, సుచిత్ర సెతి, దేవేంద్రకుమార్ బెహరా, తదితరులు పాలొన్నారు.

ఆదివాసీల ఐక్యతతో హక్కుల సాధన

రాయగడ: ఆదివాసీలంతా ఐక్యమత్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలమని ఆదివాసీ నాయకులు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక జీసీడీ ఉన్నత క్రీడా మైదానంలో జరిగిన సభలో పలువురు ఆదివాసీ నాయకులు పాల్గొని, మాట్లాడారు. తొలుత స్థానిక తుంబిగుడ కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లాలోని 11 సమితులకు చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ్ హిక్కాక, గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గొమాంగ్, పూర్వ మంత్రి లల్ బిహారి హిమిరిక, రాయగడ సమితి అధ్యక్షురాలు టునిహియిక, బసంత ఉలకా తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఆదివాసీ నాయకులు

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

రాయగడ: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా స్థానిక బాలాజీ వేంకటేశ్వర మందిరంలో, మందిర ప్రధానార్చకు డు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పదుల సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.

క్లుప్తంగా..

ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మతల్లి



వీరఘట్టం: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని, అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కుంకుమ పూజలు నిర్వహించారు.

కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొండ: నూతన కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కల్వర్టుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. యాత వీధి, వీవర్స్ కాలనీ, నీళ్లట్యాంక్ వీధులకు వెళ్లే మార్గంలో కల్వర్టులు నిర్మించనున్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచులకు శిక్షణ

గరుగుబిల్లి: మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏవో ఎస్.అర్జునరావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న శిక్షణ

పాలకొండ: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం కూడా కొనసాగింది. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు.

నాగావళికి తగ్గిన వరద

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో నాగావళి నదికి శుక్రవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గురువారం పై ప్రాంతం నుంచి నదిలోకి 6 వేల క్యూసెక్కులకు పైగా నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు మళ్లించారు. శుక్రవారం 2,500 క్యూసెక్కుల మేర వరద చేరింది. దిగువకు 1,950 క్యూసెక్కులు విడుదల చేశారు. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1,290 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.